# భగవత్ప్రేమ నిమిత్తం ప్రార్థన చేయండి

*క్రమము తప్పక మింట ప్రతి దినంబును భాను*
*డుదయాస్తమయముల నొందనేల ?*
*గగనంబునకు కాంతి కైసేయు తారలు*
*పగలు మాత్రము దాగు భంగియేల?*
*క్షణమైన విశ్రాంతి గొనక తా పవనుండు*
*జీవకోటుల బ్రోవ వీవనేల ?*
*అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది*
*సలిలమై ప్రవహించు చందమేల?*

ప్రేమస్వరూపులారా !

జగత్తనగా పుట్టి, పెరిగి, పోవునటువంటిది. దీనికి ఆధారము భగవంతుడే! సృష్టి, స్థితి, లయకారకుడైన భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపము లేదు. సర్వత్రా వ్యాపించిన పంచభూతములే భగవత్స్వరూపములు. పంచభూతములు లేని స్థానం లేదు. పంచభూతములు లేని వ్యక్తి లేదు. దీనిని పురస్కరించుకొనియే భగవద్గీత ఈ రీతిగా చాటి చెబుతున్నది –

*సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం*
*సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి*

భగవంతుడు సర్వకాలములయందు సర్వవ్యాపియై ఉన్నాడని అనాదికాలమునుండి పెద్దలందరూ బోధిస్తూ వచ్చారు. ఇట్టి సర్వవ్యాపియైన భగవంతుని తత్త్వమును ఏవిధంగా గుర్తించగలము! ఒక్కొక్కరు ఒక్కొక్క పేరుతో భగవంతుని జన్మదినములను కల్పించుకొని, ఆయనను ఆరాధిస్తూ ఆనందాన్ని అనుభవిస్తున్నారు. అయితే, భగవంతునికి ఒక ఆకారము లేదు; ప్రాకృతమైన లక్షణములు లేవు. భగవంతుడు రూపనామములకు అతీతుడు.

sri sathyasai vachanamrutam

చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంతరహితు డనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
అంతటను సర్వసాక్షియై నిలచియుండు

ఇట్టి సర్వశక్తిమయుడైన భగవంతునికి ఎవరు ఏ పేరు పెట్టగలరు? ప్రకృతియే పరమాత్ముని స్వరూపమనే సత్యాన్ని మనం గుర్తించాలి.

**ఆహారము, నీరు భగవంతుని వరప్రసాదములు**

ఈ ప్రకృతియందు జన్మించిన ప్రతి శిశువు తల్లి గర్భమునుండి వేరైన తక్షణమే కెవ్వుకెవ్వుమని ఏడుస్తూ వస్తుంది. ఒక తేనె చుక్కయో లేక పాలచుక్కయో నాలుకపై పడినప్పుడు ఆ శిశువు ఏడ్పు మానివేస్తుంది. దీనిని బట్టి, ప్రతి వ్యక్తి ఆకలితోనే జన్మిస్తున్నాడని అర్థమవుతున్నది. అది ఎటువంటి ఆకలి? ప్రాకృతమైన ఆకలా? లేక, దివ్యత్వసంబంధమైన ఆకలా? ఎవరెట్టి ఆకలితో జన్మిస్తున్నారో గుర్తించుకోవటానికి మనకు వీలుకాదు. ఆహారములు వేరువేరుగా ఉండవచ్చుగాని, ఆకలి అందరికీ ఒక్కటే. ఆహారాన్ని సంపాదించుకొని, తాను భుజించటమేగాక పదిమందికి పెట్టి వారిని ఆనందింపజేయటం ప్రతి వ్యక్తియొక్క ధర్మము.

ఏ దేశమందైనా, ఏ కాలమందైనా ప్రజలు మొట్టమొదట ఆహారము కొరకు ప్రయత్నిస్తూ ఉంటారు. ఆహారము నిమిత్తం నీరు అవసరము. భూమి చల్లని నీరు త్రాగి, ఆ నీటితో పంటలు పండించి ప్రజలకు, జీవులకు ఆహారమును అందిస్తున్నది. ఆహారము లేకపోయినా కొద్దికాలము జీవించవచ్చునుగాని, నీరు లేక క్షణమైనా జీవించుటకు వీలుకాదు. నీటికోసం ప్రజలు అనేక రకములైన పూజలు, ప్రార్థనలు చేస్తూ వస్తున్నారు. కోటీశ్వరుడు మొదలుకొని కూటిపేద వరకు ప్రార్థన అందరికీ అవసరమే. నీరు కేవలం ప్రార్థన చేతనే లభిస్తుందిగాని, మరోమార్గంలో మనకు లభించదు. మానవుడు నీటిని, ఆహారమును సృష్టించలేడు. ఇవన్నీ జగత్తునకు అందించినది ఎవరు? ఆయనే దైవము. దైవము ఏది చేసినప్పటికీ అది జగత్తుయొక్క శ్రేయస్సు నిమిత్తమే! 'మాకు అది కావాలి, ఇది కావాలి' అనే ఆశచేత కాదు మీరు భగవంతుని పూజించవలసింది; భగవంతుని ప్రేమ నిమిత్తం మీరు ప్రార్థన చేయాలి.

దైవనిర్ణయాలను ఎవ్వరూ తెలుసుకోలేరు

sri sathyasai vachanamrutam

ఏ నిమిషంలో ఎవరికి ఏది ఏవిధంగా అందించాలో అది భగవంతునికే తెలుసు. భగవంతుడే మనకు అన్నీ అనుగ్రహిస్తుంటాడు; ఎవరు ఏ ప్రయత్నమూ చేయకపోయిన తనంతట తానే భక్తులపై అనుగ్రహము కురిపిస్తాడు. తన కోరిక విఫలమైనంత మాత్రమున బాధపడటం భక్తునియొక్క లక్షణం కాదు. ఈ జగత్తులో దేనిని స్వీకరించాలి, దేనిని విసర్జించాలి అనే సత్యాన్ని భక్తులు కనుక్కొని ఆ ప్రకారం వర్తించటం అత్యవసరం. ఒక మహాభక్తుడు భగవంతుని ప్రార్థిస్తూ ఇలా అన్నాడు:

*కదలదు నీదు సంకల్పము లేనిదె*
*గడ్డిపోచయును కారణకారణ*
*అదియు నిదియు ననగనేల!*
*పిపీలికాది బ్రహ్మపర్యంతము నీవె*
*అది ఎఱుంగరు మది గలంగరు*
*ముదము జెందరు భువిని కొందరు*
*వివేకమున వర్తించెదమని కడు విఱ్ఱవీగుదురు*
*కాని, చివరకేవేళ కేది సంభవించునో*
*తెలియజాలరెంతవారలైన!*

దైవనిర్ణయాలు ఎప్పుడు ఏవిధంగా ఉంటాయో ఎవ్వరూ చెప్పలేరు. దైవముయొక్క ప్లానులు, దైవముయొక్క నిర్ణయాలు దైవమే చెప్పాలి. ఎవరెవరిని ఎప్పుడెప్పుడు ఏఏ స్థానములో ఏవిధంగా అనుగ్రహించాలో దైవానికే తెలుసు. భగవంతుని విస్మరించి అహంకారంతో అన్నీ మేమే ప్రయత్నపూర్వకంగా సాధిస్తున్నామనుకోవటం వెఱ్ఱితనం. దైవప్రార్థనవల్లనే సర్వమూ నెరవేరుతుంది. కాబట్టి, అందరూ ప్రార్థన చేయాలి. దీనికోసం, దానికోసం కాదు; "ఓ భగవంతుడా! నీ ప్రేమను నాపై ప్రసరింపజేయి" అని ప్రార్థించాలి. భగవత్ప్రేమకు మనం పాత్రులమైనప్పుడు ప్రపంచమే మన హస్తగతమవుతుంది. కాబట్టి, పనుల నిమిత్తమై మీరు ప్రార్థించకండి. "ఓ భగవంతుడా! నాకు ఏ నిమిషమునకు ఏమి కావాలో అది నీవే చూసుకో" అని అంతా అర్పితం చేసి ప్రయత్నం చేస్తే అన్నీ సులభంగా జరిగిపోతాయి.

srisathyasaivachanamrutam

ఎవరు ఎట్టి ప్రయత్నములూ చేయనప్పటికీ దైవకార్యములు వాటంతటవే జరిగిపోతుంటాయి. ఇక్కడ జరిగేవన్నీ దైవకార్యములే తప్ప అన్యకార్యములు లేవు. ఏవిషయంలోనైనా "ఇది అవుతుందా, కాదా" అన్న సందేహమే మాకు లేదు. ఏది కావాలంటే అది జరగకతప్పదు. ఇంతవరకు ఏదీ తప్పిపోలేదు. స్వామి సంకల్పముచేత సకల కార్యములూ సిద్ధిస్తున్నాయి. మేము కోరేది కేవలం భక్తుల ఆనందమే! ఇక్కడికి వచ్చినందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని మీరు క్షేమంగా, ఆనందంగా జీవితాన్ని గడిపితే చాలు. నాకు మీరు ఏదీ ఇవ్వనక్కర్లేదు. మీరు ఏది కోరితే అది నేను ఇస్తుంటాను. అయితే, అది మీకు అవసరమా, కాదా అనేది కూడా చూడాలి.

## దైవప్రార్థనద్వారా సాధించలేని కార్యము లేదు

దైవ ప్రార్థనచేత మీరు ఎంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చు. కాబట్టి, మీకు ఏది కావాలన్నా దైవాన్ని ప్రార్థించండి. సైలెంటుగా ప్రార్థన చేయండి; ఇది కావాలి, అది కావాలి అని మనసులో కోరికలు పెట్టుకొని చేయకండి. కోరికలు లేకుండా ప్రేమచేత భగవంతుని ప్రార్థించండి. "స్వామీ! మేమెంతో దైవ ప్రార్థన చేస్తున్నాం. కాని, మా పనులేమీ జరగటం లేదే!" అని మీరనవచ్చు. అది కేవలం మీ ప్రార్థనలోని దోషమే గాని, భగవంతునిలోని దోషం కాదు. హృదయపూర్వకంగా ప్రార్థిస్తే అది ఫలించకుండాఉండదు. భగవత్తత్వాన్ని కనుక్కోవాలంటే అది కేవలం ప్రేమ చేతనే సాధ్యమౌతుంది. ప్రేమ లేక ఏదీ జరగదు. ప్రేమ చేత సర్వకార్యములూ సిద్ధిస్తాయి. దైవ ప్రార్థనచేత జరగని కార్యము ఏ ఒక్కటీ లేదు. దైవసంకల్పానికి తిరుగులేదు. దైవము మీ హృదయంలోనే ఉన్నాడు

ఈనాడు క్రిస్మస్ పర్వదినం. కోరికలచేత దీనిని దుర్వినియోగం చేయకండి. జీసస్ దైవముయొక్క బిడ్డ. తాను శిలువపై చిత్రహింసలకు గురి అవుతున్నప్పుడు "తండ్రీ! మీకు ఏది ఇష్టమో అది చేసుకోండి" అని ప్రార్థించాడు. అటువంటి అర్పణ భావంతో మీ కర్తవ్య కర్మలను నిర్వర్తించండి. అహంకార, ఆడంబరములు లేకుండా ప్రశాంతంగా ప్రార్థన చేయండి. తప్పక మీ ప్రార్థన సఫలమవుతుంది; కాకపోతే నన్నడగండి. దైవము మీ హృదయములోనే ఉన్నాడు. దైవము లేని స్థానమే లేదు; తాను చేయలేని పనులే లేవు. ఒకరు చిన్న, ఒకరు పెద్ద అని తాను ఏమాత్రం యోచించడు. అందరూ తన బిడ్డలే. కాబట్టి వారికి ఏది కావలసినా

srisathyasaivachanamrutam

తాను ఇస్తాడు. దైవము మనకు దూరంగా లేదు; మన హృదయంలోనే ఉన్నాడు. అనే సంపూర్ణవిశ్వాసంతో మీరు దైవాన్ని ప్రార్థించి మీ సర్వ కార్యములను సిద్ధింపజేసుకోండి. అందరూ భగవంతుని యొక్క బిడ్డలనే విశ్వాసముతో మనం పని చేస్తే ఎంతైనా సాధించవచ్చు. ఈనాడు అనేకమంది ఏవేవో గ్రంథాలు చదివి తలలు పాడుచేసుకుంటున్నారు. మీరు ఏ గ్రంథాలూ చదువనక్కర్లేదు. మీ హృదయంలో ప్రేమను ప్రతిష్ఠ చేసుకొని, భగవంతునిపై భారం వేసి కార్యాచరణలో ప్రవేశించండి. తప్పక అన్ని కార్యములూ సఫలమవుతాయి.

**మీలోనున్న స్వామి మీ ప్రార్థన వింటూనే ఉంటాడు**

ప్రేమస్వరూపులారా! నా సంభాషణంతా ప్రేమతోనే నిండి యుంటుంది. ప్రేమయే నా ప్రధానమైన శక్తి. ప్రేమను మీరు పెంచుకుంటే మీ సర్వాభీష్టములూ నెరవేరుతాయి; భగవంతుడు మీ ఇంటనే, వెంటనే ఉండి మిమ్మల్ని సదా సంరక్షిస్తుంటాడు. అయితే, లోపల ఒకటి, బయట మరొకటి పెట్టుకొని ప్రార్థన చేయకండి. మనోవాక్కాయకర్మల ఏకత్వంతో ప్రార్థన చేయాలి. మీరు ఏమని ప్రార్థిస్తున్నారో మీ లోపల ఉన్న స్వామి వింటూనే ఉంటాడు. స్వామి బయట ఉన్నాడనే భావంతో మీరు లోపల ప్రార్థన చేస్తే అది స్వామికి ఎట్లా చేరుతుంది? స్వామి మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాడనే పరిపూర్ణమైన విశ్వాసంతో ప్రార్థన చేయండి. ప్రేమ చేత సాధ్యం కానటువంటిది లోకంలో ఏదీ లేదు. కాబట్టి ప్రేమనే మీరు ప్రధానమైన ప్రార్థనగా తీసుకోండి.

(2004 డిసెంబరు 25వ తేదీ క్రిస్మస్ నాడు సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasai vachanamrutam